ఇదిగో అంటూనే.. వదిలేశారు నాలుగేళ్లు

● సగం కూడా పూర్తి కాని గృహాలు ● మార్చిలోగా కావాల్సిందేనని కేంద్రం గడువు

ఈనాడు-పార్వతీపురం మన్యం

ఇక గూడు లేని పేదలు ఉండరు. రికార్డు స్థాయిలో ఇళ్లు నిర్మించి వారికి అప్పగిస్తాం. గత వైకాపా ప్రభుత్వ మాట ఇది.

కానీ..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పేదలకు గృహాలు మంజూరు చేసిన వాటిలో సగం కూడా పూర్తి చేయలేకపోయారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం గృహాలు మంజూరు చేసింది. తొలుత ఆసక్తి చూపిన లబ్ధిదారులు తర్వాత వెనుకంజ వేశారు. ఊరికి దూరంగా లేఅవుట్లు వేశారని కొందరు.. అనువుగా లేని చోట్ల గృహాలు నిర్మించుకోమంటే ఎలా అని మరికొందరు ప్రశ్నించారు. అప్పటికే ఎక్కడెక్కడో ఇళ్ల స్థలాల కొనుగోలులో నాలుగు రాళ్లు వెనకేసుకున్న వైకాపా నేతలు పేదలను పట్టించుకోలేదు.

తప్పని తిప్పలు

కేంద్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అందించిన రూ.1.80 లక్షలు చాలవని, సొంతంగా పెట్టుబడి పెట్టలేమని చాలా మంది చేతులెత్తేశారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందించకపోగా.. కేంద్రం విడతల వారీగా విడుదల చేసిన బిల్లులకు సంబంధించిన నిధులు దారి మళ్లించింది. దీంతో చేసిన పనులకు సకాలంలో బిల్లులు పాసవ్వలేదు. ఉచిత సరఫరా అంటూనే సకాలంలో ఇసుక ఇవ్వలేదు. లేఅవుట్లలో కనీస వసతులు కల్పించలేదు. గత డిసెంబరు నుంచి జిల్లాల వారీగా లక్ష్యాలు ప్రభుత్వం ఇచ్చి పనులు పూర్తి కాకున్నా మెగా గృహ ప్రవేశాలు చేసింది. ఇప్పటికీ అందులో నివాసానికి చాలా మంది మొగ్గు చూపడం లేదు.

పరీక్షించిన తర్వాతే బిల్లులు

ప్రస్తుతం ఇళ్ల పనులు పరీక్షించిన తర్వాతే అధికారులు బిల్లులు చేస్తున్నారు. ఇసుక, ఇటుక, పిక్కరాయి, స్లాబ్, క్యూరింగ్, పని నాణ్యత పరిశీలిస్తున్నారు. ఇందుకు ఆప్కాస్ సంస్థను థర్డ్ పార్టీ విజిలెన్స్ వేసింది. గతంలో బిల్లులు చెల్లించిన తర్వాత నాణ్యత పరీక్షలు చేసేవారు. దీనికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. శతశాతం లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత సంపూర్ణంగా మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటి వరకు పనులకు అవసరమయ్యేలా నీరు, విద్యుత్తు సరఫరా వంటి వసతులు కల్పించింది. లబ్ధిదారుల్లో అనర్హులను ఏరివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకు ప్రత్యేక యాప్ అమలు చేస్తోంది. ఆన్‌లైన్ పరిశీలనలో విజయనగరం జిల్లాలో 2,060 మంది, మన్యం జిల్లాలో వంద మందికి పైగా అనర్హులు ఉన్నారని గుర్తించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వారీగా ఇంకా పరిశీలన జరుగుతోంది. వారి ఆదాయ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత మరికొందరు అనర్హులు తేలే అవకాశం ఉంది.



సీతానగరం లేఅవుట్‌లో గృహాలు

కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు, మరికొన్ని చోట్ల రూ.కోట్లు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసి లేఅవుట్లు వేశారు. వాటికి జగనన్న కాలనీలని పేరు పెట్టుకున్నారు. కొంత మంది పేదలకు సొంత స్థలాల్లో, లేని వారికి లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతిచ్చారు. అప్పట్లో రాజకీయ లబ్ధి పొందాలనే దురాలోచనతో అనర్హులకు సైతం నివాస స్థల పట్టాలు, ఇళ్లు మంజూరు చేశారు.

శతశాతం పూర్తి చేస్తాం

జిల్లాలో ఎప్పటికప్పుడు సమీక్షించి త్వరగా గృహాలు పూర్తి చేయించాలని ఆదేశిస్తున్నాం. లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి అన్ని విధాలా వారిని ప్రోత్సహించాలని సూచిస్తున్నాం. అకాల వర్షాల వల్ల పనులకు కొంత ఆటంకం కలిగింది. ఖరీఫ్ సీజన్ పూర్తయిన తర్వాత నిర్మాణాలు వేగవంతమవుతాయి. మార్చి 25 లోగా శతశాతం పూర్తి చేస్తాం.

– ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్

మన్యం జిల్లాలో ప్రగతి ఇదీ మంజూరు: 26,062 పూర్తి: 14,453

పేదల కడుపు నింపేందుకే క్యాంటీన్లు



కూటమి నాయకులతో కలసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, న్యూస్‌టుడే: పేదల కడుపు నింపేందుకే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించిందని ఎమ్మెల్యే జయకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయ సమీపంలో నిర్మించిన క్యాంటీన్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. గత వైకాపా ప్రభుత్వం పేదలకు పట్టెడన్నం పెట్టే క్యాంటీన్లు మూసివేసిందని ఆరోపించారు. అనంతరం పేదలతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. తెదేపా అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు పల్లా కొండలరావు, రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, పట్టణ, మండల అధ్యక్షులు గంటా సంతోష్, గండి రామినాయుడు, జనసేన నాయకుడు సత్తిబాబు, కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీకో ఉద్యానం

● పాఠశాలల పిల్లలకు 'బంగారుభవిత' ● 'న్యూస్‌టుడే'తో కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

ముఖాముఖి

న్యూస్‌టుడే, పార్వతీపురం

పార్వతీపురం మన్యంలోని వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధికి కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం 'న్యూస్‌టుడే'తో ఆయన మాట్లాడి జిల్లాలో అమలు చేయనున్న కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. యువతకు ఉపాధి, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించామన్నారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

451 పంచాయతీల్లో పార్కులు


ప్రస్తుతం చిన్నారులు చరవాణులకే పరిమితం అవుతున్నారు. ఇంటి నుంచి బయటకు రాకుండా అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 451 పంచాయతీల్లో ఉద్యానాలు ఏర్పాటు చేయనున్నాం. ఇందుకు స్థలాల గుర్తింపునకు ఆదేశాలు ఇచ్చాం. పిల్లలు ఆడుకునేందుకు ఒక్కో పార్కులో రూ.2 లక్షలు చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులతో సామగ్రి కొంటాం.

శుభ్రత దిశగా అడుగులు

జిల్లాలో పరిశుభ్రత కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని నిర్ణయించాం. ఇది పార్వతీపురం నుంచే ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నాం. జిల్లా కేంద్రంగా పని చేస్తున్న జట్టు సంస్థ నిర్వాహకురాలు పద్మజ, ఇతర సంస్థలు, వ్యక్తులతో కలిసి ముందుకు వెళ్తాం. పట్టణంలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తాం. పట్టణానికి వచ్చే మహిళలకు అందుబాటులో ఎక్కడికక్కడ సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తాం.

విద్యార్థుల ఆరోగ్యానికి పెద్దపీట

గతంలో పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు చాలా మంది అనారోగ్యం బారిన పడి మృతి చెందారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా 'బంగారు భవిత పథకం' అందుబాటులోకి తీసుకొచ్చాం. జిల్లాలో 1,589 ప్రభుత్వ పాఠశాలల్లోని 1,18,520 మంది పిల్లలకు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేసి వారి ఆరోగ్య వివరాలు నమోదు చేస్తాం. దీని వల్ల ఎవరైనా అనారోగ్యం బారిన పడితే సులభంగా సేవలు అందించవచ్చు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తాం.




బడి తోటలతో ఫలితాలు

ఇటీవల ప్రారంభించిన బడి తోటలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలోని 1,253 పాఠశాలల్లో 322 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. రూ.4.5 లక్షల విలువైన 1500 పొట్లాల చొప్పున కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు అందించాం. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో కూరగాయలు పండుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత నిధులు సమకూర్చడంపై దృష్టి సారిస్తున్నాం.

యువతకు ఉపాధి కల్పన

ఉద్యోగ మేళాలకు వెళ్తున్న యువతలో చాలా మందికి నిరాశే ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల్లో జీవనోపాధుల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. అవసరం ఉన్న వారు వివరాలు, అర్హతలు నమోదు చేసుకోవాలి. శిక్షణ, రుణం, ఉద్యోగం, ఉపాధి ఏది కావాలో ఎంచుకోవాలి. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా అభ్యర్థుల చరవాణి నంబరుకు వివరాలు తెలియజేసి ఉపాధి చేరువ చేస్తాం.

ప్రకృతి పరవశించే



మక్కువ మండలం దుగ్గేరు అటవీ ప్రాంతం పచ్చదనంతో మనస్సును ఉల్లాసపరుస్తోంది. కనుచూపు మేరకు చుట్టూ కొండలు, వాటి మధ్య వరి సాగుతో పాటు పోడు వ్యవసాయం కనువిందు చేస్తోంది.

– న్యూస్‌టుడే, మక్కువ

నందీశ్వర.. నమోనమః



గౌరీపౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో నందీశ్వరుని విగ్రహాలు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మక్కువ కుమ్మరి వీధిలో ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలను భక్తులు దర్శించుకున్నారు.

– న్యూస్‌టుడే, మక్కువ

బాధ్యులపై చర్యలు తీసుకోండి

రాకేశ్ కుటుంబ సభ్యుల ఆందోళన

పార్వతీపురం, గ్రామీణం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పోక్సో కేసు నమోదైన యువకుడు రాకేశ్ ఇటీవల రైలు కింద పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. యువకుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనలో పోలీసుల తీరు సక్రమంగా లేదని నినాదాలు చేశారు. మృతుడి తల్లిదండ్రులు అప్పుడు, గౌరమ్మతో పాటు గ్రామస్థులతో ఏఎస్పీ అంకిత సురానా చర్చించారు. ఆందోళన చేయకుండా ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామన్నారు. మృతదేహానికి శవ పరీక్ష నిర్వహిస్తే వాస్తవాలు తెలుస్తాయని నచ్చజెప్పడంతో వారు శాంతించారు.

కలెక్టర్‌కు వినతిపత్రం

చేతికి అందొచ్చిన కుమారుడు అకారణంగా మృతి చెందాడని తల్లిదండ్రులు అప్పడు, గౌరమ్మ కన్నీరుమున్నీరయ్యారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. నిజంగా తప్పు చేస్తే శిక్ష అనుభవించి ఇంటికి వచ్చేవాడని, ఇలా ప్రాణాలు పోయేవి కావని ఆవేదన చెందారు. ఎస్పీతో చర్చించి వాస్తవాలు తెలుసుకుని న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

వీఆర్‌కు పార్వతీపురం గ్రామీణ ఎస్సై

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, కలెక్టరేట్ ప్రాంగణం: పార్వతీపురం గ్రామీణ ఎస్సై దినకర్‌ను వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో పట్టణ ఎస్‌ఐ సంతోషికుమారిని నియమించారు.



బాధిత కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న ఏఎస్పీ అంకిత



అతిసారం.. అప్రమత్తం

● నీరు, ఆహారం కలుషితంతోనే వ్యాధి
● ఉమ్మడి జిల్లాలో కేసుల నమోదు
● గుర్ల ఘటనతో జాగ్రత్తలు తప్పనిసరి

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం లోపించినా, నీరు కలుషితమైనా, పాడైన ఆహార పదార్థాలు తిన్నా అతిసారం వచ్చే ప్రమాదం అధికం. ఈ వ్యాధి అప్పుడప్పుడు.. అక్కడక్కడ బయట పడుతుంది. ఒకేసారి ఎక్కువ మంది వ్యాధితో మంచాన పడినప్పుడే విషయం వెలుగులోకి వస్తుంది. లేకుంటే సాధారణ సమస్యగానే అందరూ చూస్తారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. మూడు లేక అంతకంటే ఎక్కువసార్లు వదులుగా విరేచనాలు అయితే అతిసారంగా భావించాలి. విజయనగరం జిల్లా గుర్లలో ఈ వ్యాధి సోకిన నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సూచించారు.

ఇవి తీసుకోవాలి

★ నీరసం రాకుండా ఓఆర్ఎస్ తాగించాలి.
★ విరేచనాలు తగ్గడానికి జింక్ మాత్రలివ్వాలి.
★ విరేచనాలు తగ్గిన తర్వాత కూడా రెండు వారాల వరకు రెట్టింపు ఆహారం ఇవ్వాలి.
★ ప్రమాద స్థితిలో వైద్యుడిని లేదా ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలి.
★ యాంటీ బయోటిక్ మందులు వాడరాదు.

ఓఆర్ఎస్ ప్రాణరక్షణి

చప్పగా, ఉప్పగా ఉందని.. తాగడానికి ఇష్టపడక పక్కన పెట్టేస్తారు చాలా మంది. అతిసారం బారిన పడ్డ వారికి అత్యంత ప్రాణరక్షణిగా పనిచేసేది ఓఆర్ఎస్ ద్రావణమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. సులభంగా, ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో దొరికే ఈ పొట్లాలు అంటే చాలా మందికి చిన్న చూపు అని చెప్పవచ్చు. అతిసారం బారిన పడ్డ వారిని తిరిగి సాధారణ స్థాయికి తీసుకువచ్చే అమృతం ఇదేనని వైద్యులంటున్నారు.

అది లేనప్పుడు ఏం చేయాలి?

★ ఓఆర్ఎస్ లేనప్పుడు ఇంట్లోని కొన్ని ద్రవ పదార్థాలు ఇవ్వవచ్చు.
★ పాలు తాగే పిల్లలకు తల్లి పాలు ఎక్కువసార్లు ఇవ్వాలి. ★ ఉప్పు, పంచదార నీరు, కొబ్బరి నీరు, గంజి, సగ్గు బియ్యం జావ, మజ్జిగ, నిమ్మకాయ రసం, పప్పునీరు ఇవ్వవచ్చు.

ఇవ్వకూడనివి

★ గ్లూకోజ్, పండ్ల రసాలు, శీతల పానీయాలు

వైద్యుడ్ని ఎప్పుడు సంప్రదించాలి


★ వాంతులు, విరేచనాలు ఎక్కువగా అయినప్పుడు.
★ స్పృహలో లేకపోయినా..
★ మూత్రం తక్కువగా అయినప్పుడు.
★ విరేచనాల్లో రక్తం, చీము పడినప్పుడు.
★ చాలా నీరసంగా ఉన్నప్పుడు.
★ జ్వరం వచ్చినప్పుడు.
★ కడుపు పొంగినప్పుడు.

విరేచనాలు తగ్గిన తర్వాత

★ కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
★ రెండు వారాల వరకు ఆహారం ఎక్కువసార్లు తినిపించాలి. ★ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
★ నీటిపై, ఆహారంపై తప్పకుండా మూతలు పెట్టాలి.

ఉల్లాసంగా నేర్చుకోండి

● మహిళా అక్షరాస్యతపై దృష్టి
● ఉమ్మడి జిల్లాలో 71,522 మంది లక్ష్యం



జిల్లాల వారీగా లక్ష్యం
విజయనగరం 48,578
పార్వతీపురం మన్యం 22,944

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని మహిళల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. 2011 గణాంకాల ప్రకారం వీరి అక్షరాస్యత శాతం 49.87. గతంలో తెదేపా హయాంలో వెలుగు, ఉపాధి పథకాల కింద పలు కార్యక్రమాలు చేపట్టారు. అప్పటి గణాంకాల ప్రకారం ఎస్‌హెచ్‌జీల్లో 2,07,735 మంది, ఉపాధి వేతనదారుల్లో 3,24,085 మందిని గుర్తించి అక్షరాలు నేర్పించేందుకు చర్యలు తీసుకున్నారు. వైకాపా ప్రభుత్వంలో ఇవన్నీ ఆగిపోయాయి.

మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన 'ఉల్లాస్'(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)ను రాష్ట్రంలో ఉద్యమంగా నిర్వహించేలా చర్యలు చేపడుతోంది. ఉమ్మడి జిల్లాలో అమలుకు సంబంధించి ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. నిరక్షరాస్యులైన 71,522 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. అయిదు నెలల పాటు ఈ యజ్ఞం సాగనుంది. 2025 మార్చి 31 నాటికి లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

గుర్తింపు ఇలా..

పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పనిచేస్తున్న సహాయకులు, వంట పనివారు, కాపలాదారులు, ఆయాలు, అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల్లో నిరక్షరాస్యులను గుర్తిస్తారు. ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ యాజమాన్యాలతో పాటు కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని పరిగణనలోకి తీసుకోనున్నారు. డీఆర్‌డీఏ పరంగా గ్రామైక్య సంఘాల వివరాలను వీవోఏ, సీసీలు సేకరించనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం ప్రతి పది మందికీ ఒక వాలంటీరును (సంఘంలో విద్యావంతులైన వారిని) ఎంపిక చేస్తారు. వయోజన విద్యాశాఖ ద్వారా పుస్తకాలు అందజేస్తారు. టీసీఎస్ కంపెనీ సహకారంతో ఫంక్షనల్, డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించనున్నారు. ఈ అభ్యసన తరగతులు అంగన్‌వాడీ కేంద్రాల్లో జరగనున్నాయి.



వయోజనులకు చదువు చెబుతున్న చిట్టి గురువులు (పాతచిత్రం)

7 శాఖల భాగస్వామ్యం

వివిధ శాఖల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. వయోజన విద్య, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, డీపీవో, గ్రామ-వార్డు సచివాలయం, డీపీఆర్వో, విద్యాశాఖ అధికారులతో జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. వీరంతా అమలును పర్యవేక్షిస్తారు. దీనిపై శుక్రవారం సమావేశం కానున్నారు. వీరితో పాటు ప్రతి జిల్లాకూ ఒక నోడల్ అధికారి ఉంటారు. విజయనగరానికి వయోజన విద్య డీడీ అల్లు సోమేశ్వరరావు, పార్వతీపురం మన్యానికి వైకుంఠరావును (శ్రీకాకుళం జిల్లా వయోజన విద్య ఏడీ) నియమించారు.

ఉమ్మడి జిల్లాలో అక్షరాస్యత శాతం

సంవత్సరం	అక్షరాస్యత	పురుషులు	మహిళలు
1981	21.74	12.55	22.47
1991	34.19	45.92	30.98
2001	51.07	62.37	39.91
2011	58.89	68.15	49.87

25 నుంచి శిక్షణ

ఈనెల 25న రాష్ట్రస్థాయిలో నిర్వహించే శిక్షణా తరగతులకు వయోజనవిద్య, డీఆర్‌డీఏ నుంచి ఇద్దరేసి అధికారుల చొప్పున ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లనున్నారు. తర్వాత ఎంపీడీవో, ఏపీఎంలకు జిల్లాస్థాయిలో, మండల స్థాయిలో సీసీ, వీవోఏ, వాలంటీర్లకు తరగతులుంటాయి. అనంతరం క్షేత్రస్థాయిలో ప్రారంభమవుతాయని వయోజన విద్య డీడీ సోమేశ్వరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పరిహారానికి సమ్మతి

★ మొక్కజొన్న రైతులకు ఊరట

పార్వతీపురం, న్యూస్‌టుడే: తమకు న్యాయం చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించిన మొక్కజొన్న రైతులకు ఊరట కలిగింది. మక్కువ మండలం నంద గ్రామానికి చెందిన గిరిజన రైతులు 20 ఎకరాల్లో మొక్కజొన్న వేయగా కంకులు సక్రమంగా రాలేదు. చిన్న చిన్నవి వచ్చి కుళ్లిపోయాయి. దీనిపై **'ఈనాడు'లో 'నకిలీలు కట్టబెట్టారు'** శీర్షికతో కథనం వెలువడింది. ఈనెల 7న రైతులు కలెక్టరేట్‌కు వచ్చి ఆందోళన చేపట్టి విషయం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై దర్యాప్తు చేయాలని వ్యవసాయ శాఖ జేడీ రాబర్ట్‌పాల్‌ను ఆదేశించారు. ఆయన రైతుల నుంచి వివరాలు సేకరించారు. విత్తనాలు అమ్మిన వ్యాపారులతో బుధవారం చర్చించారు. నష్టపోయిన 18 మందికి పరిహారం ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించినట్లు వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సోమవారంలోపు నగదు చెల్లించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.



వ్యాపారులతో సమావేశమైన అధికారులు

పోషకాహారంతో రక్తహీనత నివారణ

పార్వతీపురం, న్యూస్‌టుడే: పిల్లలు అమ్మఒడి నుంచి నేరుగా అంగన్‌వాడీ కేంద్రానికి వస్తారని, అక్కడ వారిని ఆహ్లాదకర వాతావరణంలో పెంచాల్సిన బాధ్యత సిబ్బందిదేనని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించారు. గర్భిణులు, కౌమార బాలికల్లో రక్తహీనత లేకుండా చూడాలని, పోషకాహారం సక్రమంగా అందిస్తే ఇబ్బందులు రావన్నారు. ఎక్కడైనా లోపాలు బయట పడితే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆ శాఖ అధికారిణి రాణి ఉన్నారు.

సంస్కృత కళాశాలలో దూరవిద్య కేంద్రం

విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని మహారాజా సంస్కృత కళాశాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దూరవిద్య కేంద్రాన్ని(స్టడీ సెంటర్) ప్రారంభించినట్లు కళాశాల ప్రధానాచార్యుడు డా.జి.జనార్దననాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని, నవంబరు 15 వరకు అవకాశముందని చెప్పారు. ఇతర వివరాలకు 94920 21464 నంబరును సంప్రదించాలని కోరారు.

సెలవుల్లో శిక్షణ ఇవ్వాలి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇవ్వడంతో విద్యాభివృద్ధి కుంటు పడుతోందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మహేష్, ఎన్.బాలకృష్ణ అన్నారు. 1, 2 తరగతుల ఉపాధ్యాయులకు తిరుపతి కేంద్రంగా శిక్షణ ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. అందరికీ వేసవి సెలవుల్లో మండలాల్లోనే తరగతులు చెప్పాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అనుబంధ అధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.తవినాయుడు, కె.విజయ్, కార్యనిర్వాహక కార్యదర్శి జి.శశికుమార్ కోరారు.

అరకు వ్యాలీలో హెలీప్యాడ్ సేవలు ప్రారంభించాలి



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: అరకు వ్యాలీలో హెలీప్యాడ్ సేవలు ప్రారంభించాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు దిల్లీలో గురువారం కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. పర్యాటకుల ఇబ్బందుల నేపథ్యంలో ఈ ప్రతిపాదనను పరిశీలించాలని విన్నవించారు.

నేడు జిల్లా స్థాయి చదరంగం పోటీలు

పార్వతీపురం పట్టణం: అండర్ 14, 17 విభాగాల్లో స్కూల్ గేమ్స్ చదరంగం పోటీలను శుక్రవారం పార్వతీపురంలోని బాలికల ఆర్సీఎం పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. ఉమ్మడి జిల్లాల విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని, ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు.

మామిడి చెట్టుకు 15 రకాల కాయలు

మందార మొక్కకు 20 రకాల పూలు

తురాయిపువలస నర్సరీలో వినూత్న ప్రయోగం



అంటు కట్టిన మందార మొక్కలను చూపిస్తున్న ఉద్యానశాఖ అధికారి కాంతారావు

నచ్చిన మామిడి పండ్లను ఇంట్లోనే పండించి తినొచ్చు.. ఇష్టమైన పూలను పెరట్లోనే పెంచి కోసుకోవచ్చు.. దీని కోసం వందల చెట్లు, మొక్కలు అవసరం లేదండోయ్.. ఒక్క మామిడి చెట్టు నుంచే వివిధ రకాల పండ్లను పొందవచ్చు. అలాగే ఒకే మందారం చెట్టు నుంచి నచ్చిన పూల రకాలను పెంచుకోవచ్చు. ఈ అరుదైన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏకు చెందిన తురాయిపువలస ఉద్యాన క్షేత్రం అధికారులు. మిక్స్‌డ్ పేరుతో అంట్లు కట్టే విధానాన్ని ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా కొన్ని రోజులుగా వీటి తయారీకి చర్యలు చేపట్టారు. ఒకే చెట్టుకు 15 నుంచి 20 రకాల మామిడి కాయలు, మందార మొక్కకు సుమారు 20 రకాల పూలు పూసేలా సిద్ధం చేస్తున్నారు.

కుండీలుంటే చాలు..

అవసరం మేర ఈ మొక్కలను నాటుకోవచ్చు. స్థలం లేకపోతే పెద్ద కుండీల్లోనూ పెంచుకోవచ్చు. అంటు కట్టిన మందారం మొక్క నుంచి మూడు నెలల్లోనే నచ్చిన పూలు వస్తాయి. మామిడికి సంబంధించి రెండేళ్ల పాటు పూతను తొలగించాలని, మూడో ఏడాది నుంచి కాపునకు వదిలేయాలని ఉద్యానశాఖ అధికారి కె.కాంతారావు తెలిపారు. ప్రస్తుతం రెండేసి వేల చొప్పున తయారు చేస్తున్నామని, మరో రెండు నెలల్లో మందార మొక్కలను సరఫరా చేస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో నిమ్మ, బత్తాయిపై కూడా ప్రయోగాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సాధారణంగా రెండు మూడు రకాలతో అంట్లు నాటుతారని, కానీ తాము అత్యధికంగా 20 రకాలతో మొక్కలను తయారు చేస్తున్నామన్నారు. ఈ విధానంతో నచ్చిన పండ్లు, పూలు ఇళ్ల వద్దే అందుబాటులో ఉంటాయని చెప్పారు. – న్యూస్‌టుడే, సీతంపేట



అంటు కట్టిన మామిడి మొక్క

రూ.50 వేల రాయితీతో ఎస్సీ, ఎస్టీలకు రుణాలు

నవంబరు నుంచి లబ్ధిదారుల ఎంపిక, మంజూరు

– న్యూస్‌టుడే, మయూరికూడలి

ఎస్సీ, ఎస్టీ వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే ఉన్నతి పథకం నుంచి రుణాలు అందిస్తోంది. మరోవైపు పొదుపు సభ్యులకు రుణ పరపతిని సైతం పెంచింది. రూ.50 వేల నుంచి రూ.5 లక్షలు చేసింది. ఈక్రమంలో రూ.50 వేల వరకు రాయితీతో కొత్తగా రుణాలిచ్చేందుకు ప్రణాళికలు వేస్తోంది. ఈ ఏడాది నుంచి అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు వచ్చేనెల నుంచి లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో 67,250కు పైగా సంఘాలు ఉండగా.. వాటిలో 18 శాతం వరకు ఎస్సీ, ఎస్టీ సంఘాలున్నాయి. ప్రస్తుతం ఉన్నతి పథకం ద్వారా వీరికి పూర్తిగా వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారు. ఈ ఏడాది విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 2800 మందికి రూ.14 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటివరకు విజయనగరంలో 1200 మందికి రూ.6 కోట్లు, మన్యంలో 168 మందికి రూ.1.52 కోట్లు ఇచ్చారు. పలువురికి జీవనోపాధుల కింద యూనిట్లు మంజూరు చేశారు. వెలుగు, అంతర్గత, సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధితో పాటు అదనంగా రాయితీ రుణాలు ఇవ్వనున్నారు.



ఉన్నతి రుణాల సద్వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సభ్యురాలు

ఈ ఏడాది లక్ష్యం(రూ.కోట్లలో)

జిల్లా	సభ్యులు	రుణం
విజయనగరం	1800	9
మన్యం..	1000	5

వర్తింపు ఇలా..

కొత్త విధానంలో భాగంగా సభ్యురాలు ఎంత తీసుకున్నా.. రాయితీ వర్తించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఈ నిధులను సమకూర్చనున్నారు. ఈమేరకు ఉన్నతి పథకాన్ని సదరు కార్పొరేషన్‌కు అనుసంధానించనున్నారు. అందులో భాగంగా ప్రతి యూనిట్‌కు రూ.50 వేల సబ్సిడీ దక్కుతుంది.

గరిష్ఠంగా రూ.5 లక్షలు..

ప్రభుత్వ ఆదేశాలతో లబ్ధిదారులకు కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు ఇవ్వనున్నారు. ఈ రుణంతో సుమారు 112 జీవనోపాధులకు చెందిన యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి. చిరు పరిశ్రమలు కూడా పెట్టుకోవచ్చు. వెలుగుశాఖ ద్వారా ముందుగానే దరఖాస్తులు తీసుకోవాల్సి ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. రుణం పొందాక సొంతానికి వాడుకోకుండా తప్పనిసరిగా యూనిట్ ప్రారంభించాలని స్పష్టం చేశారు. వారికే రాయితీ దక్కుతుందన్నారు. సబ్సిడీ పథకానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైందన్నారు.

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

పార్వతీపురం, న్యూస్‌టుడే: రామాయణాన్ని భారత జాతికి అందించిన వాల్మీకి మహర్షి గొప్ప వ్యక్తి అని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వెనుకబడిన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. జేసీ శోభికతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ ఆ మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడు, అధికారులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక, అధికారులు

పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులివ్వాలి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి సింగిల్ విండో విధానాన్ని పక్కాగా అమలు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. పారిశ్రామిక వేత్తలు, ఆశావహులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చిన్న పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టేందుకు యువత సిద్ధంగా ఉందని చెప్పారు. ఈక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, విద్యుత్తు, అగ్నిమాపక, రెవెన్యూ తదితర శాఖల వద్ద దస్త్రాలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రతి జిల్లాకూ ఒక ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలని విన్నవించారు. నాయకులు రామచంద్రరాజు, రామ్మోహన్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

ఆదాయం వస్తున్నా.. చేకూరని ప్రయోజనం

కమిటీల ఆర్జన ఇలా..

- మార్కెట్ కమిటీల సంఖ్య : 8
- ఈ ఏడాది లక్ష్యం: రూ.12.84 కోట్లు
- ఇంతవరకు వసూలు : రూ.3 కోట్లు
- గత అయిదేళ్లలో సెస్సు: రూ.77.07 కోట్లు

బొబ్బిలి, న్యూస్‌టుడే: రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెట్ కమిటీలు ముక్కు పిండి రెండు శాతం పన్ను వసూలు చేస్తున్నాయి. కానీ వారి సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశాయి. గత అయిదేళ్లలో సుమారు రూ.77 కోట్ల ఆదాయం సమకూరినా గోదాములు, అనుబంధ రహదారులు, ఇతర ప్రయోజన పథకాలకు ఖర్చు చేసింది నామమాత్రమే. ప్రస్తుతం ఆయా నిధులు ఖాతాల్లోనే మూలుగుతున్నాయి. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం కమిటీల పాలక వర్గాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

దళారులే దిక్కు

వ్యవసాయ ఉత్పత్తులను దళారులకు అమ్మకుండా కమిటీల్లో కుదవ పెట్టుకుని రుణం తీసుకునే 'రైతుబంధం' పథకం అమలు కావడం లేదు. పంట విలువలో 80 శాతం వరకు రుణం ఇచ్చే అవకాశం ఉంది. ధర వచ్చాక పంటను విక్రయించి రుణాలను తీసుకునే వెసులుబాటును కమిటీలు కల్పించాలి. జిల్లాలో 8 కమిటీలున్నాయి. వీటి పరిధిలో సుమారు లక్ష మంది అన్నదాతలు ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరికీ ప్రయోజనం చేకూరలేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుని దోపిడీకి గురవుతున్నారు.



తెర్లాం మండల కేంద్రానికి సమీపంలో ఖాళీగా ఉన్న కమిటీ స్థలంలో గోదాం నిర్మాణానికి పడని అడుగులు

గిడ్డంగులు, గోదాములేవీ..

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను కళ్లాలకు, ఇళ్లకు తరలించుకునేందుకు వీలుగా పొలాలకు లింకు రహదారులు ఏర్పాటు చేయాలి. గతంలో ఒక్కో కమిటీ పరిధిలో 30 శాతం నిధులు ఇందుకు కేటాయించారు. ఒక్కో కమిటీ పరిధిలో రైతుల అభిప్రాయాలను తీసుకుని ప్రాధాన్యత మేరకు ఏడాదికి 10 నుంచి 15 రహదారులు వేసేశారు. గత ఐదేళ్లలో ఒక్క రహదారి కూడా వేయలేదు. రైతులు ఉత్పత్తులు దాచుకుని ధర ఉన్న సమయంలో అమ్ముకునేందుకు శీతల గిడ్డంగులు నిర్మించలేదు. తడిపోయిన పంటను ఆరబెట్టుకొనేందుకు ప్లాట్‌ఫారాలు నిర్మించాలి. అవి ఎక్కడా కానరావు. అన్నింటికీ ప్రతిపాదనలే తప్ప అమలుకు నోచుకోలేదు. మార్కెట్ కమిటీల్లో సంతలు నిర్వహించి రైతుకు కావాల్సిన వ్యవసాయ ఉపకరణాలు సరసమైన ధరలకు దొరికేలా చూడాలి. వ్యాపారులను తీసుకువచ్చి లావాదేవీలు జరపాలి. వాటి దాఖలాలు లేవు.

వైద్య శిబిరాల జాడేదీ? పాడి సంపద అభివృద్ధికి మార్కెట్ కమిటీలు పెద్ద పీట వేసి.. ఏడాదికి నాలుగు పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసే వారు. ఒక్కో శిబిరానికి రూ.20 వేల వరకు ఖర్చు చేసేవారు. ఐదేళ్లుగా వీటి నిర్వహణ లేదు. వ్యాధులతో బాధపడుతున్న పశువులకు సంపూర్ణ వైద్యం అందించి, మందులను చేసే వారు. గత ప్రభుత్వంలో అవన్నీ ఎత్తేశారు.

ప్రతిపాదనలు సిద్ధం

రైతు సంక్షేమ పథకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. అనుబంధ రహదారులు, గిడ్డంగుల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. మార్కెట్ కమిటీల పరిధిలో వచ్చే ఆదాయం రైతుల సంక్షేమానికి ఖర్చు చేయనున్నాం.

– రవికృష్ణ, ఏడీ, మార్కెటింగుశాఖ



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

పైడితల్లికి పెద్దఎత్తున కానుకలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం స్థానిక అమ్మవారి కల్యాణ మండపంలో లెక్కించారు. జాతర నేపథ్యంలో పెద్దఎత్తున కానుకలు వచ్చాయి. 14 రోజులకు గానూ చదురుగుడి నుంచి రూ.45,02,250 నగదు, 40.800 గ్రాముల బంగారం, 955 గ్రాముల వెండి, 45 రోజులకు గానూ వనంగుడి నుంచి రూ.11,41,151 నగదు, 6.500 గ్రా. బంగారం, 73 గ్రా. వెండి, 21 అమెరికన్ డాలర్లు, రూ.50 వేల విలువైన ఇండోనేషియా నోట్లు వచ్చినట్లు దేవస్థానం ఈవో ప్రసాదరావు తెలిపారు. మాన్సాస్ ట్రస్టు డిప్యూటీ కమిషనర్ కేఎన్‌డీవీ. ప్రసాదరావు పర్యవేక్షించారు.

చికెన్ ధరలు


రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	142	254	264

మనస్తాపంతో విద్యార్థిని బలవన్మరణం

పాతపట్నం, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన పాతపట్నంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సీతంపేట మండలానికి చెందిన విద్యార్థిని(12) అక్కడున్న ఓ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. దసరా సెలవుల అనంతరం గురువారం తల్లితో కలిసి విద్యాలయానికి వెళ్లింది. వసతిగృహంలో ఉండనని.. ఇంటికి వచ్చేస్తానని రోదించింది. నెలాఖరులో వస్తానని నచ్చజెప్పి తల్లి ఇంటి ముఖం పట్టింది. దీంతో మనస్తాపానికి గురైన బాలిక వసతిగృహం గదిలోకి వెళ్లి జడ రిబ్బన్లతో ఉరేసుకుంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామారావు తెలిపారు.

గుండెపోటుతో రైల్లోనే మృత్యువాత

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: రైలులో వెళ్తున్న ప్రయాణికుడు గుండె పోటుతో మృతి చెందిన ఘటన పార్వతీపురంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. రాయగడకు చెందిన బి.సన్యాసిరావు(57) విజయనగరం వెళ్లేందుకు సూరత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. ఒడిశాలోని లడ్డ రైల్వే స్టేషన్ వచ్చేసరికి అస్వస్థతకు గురయ్యారు. అక్కడివారు ఆర్పీఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. వారు బెలగాం పోలీసులకు సమాచారం అందించగా.. అత్యవసర వాహనాన్ని సిద్ధం చేశారు. రైలు వచ్చిన వెంటనే దించినా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య సూర్యప్రభ నుంచి జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు వాగ్మూలం సేకరించారు.



సన్యాసిరావు (పాతచిత్రం)

ఎటు చూసినా కన్నీటి ధారలే

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా ఆసుపత్రిలో గురువారం ఏ వైపునకు వెళ్లినా ఆర్తనాదాలే వినిపించాయి. గత రెండు రోజుల్లో మన్యంలో ప్రమాదవశాత్తూ ముగ్గురు, ఆత్మహత్య చేసుకొని ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ● గోపాలపురానికి చెందిన యువకుడు రాకేశ్ ఈనెల 15 రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని 16న ఆసుపత్రికి తరలించారు. మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో 17న పోస్టుమార్టం చేశారు. ● పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిలో బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో వీరఘట్టానికి చెందిన మహిళ, సీతానగరం హడ్కో కాలనీ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు, చెరువులో పడి కొమరాడ మండలం చంద్రపేటకు చెందిన హోంగార్డు మరణించారు. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఇక్కడికి తీసుకొచ్చారు. అప్పటికే చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆసుపత్రి ఘోషించింది.



ఆసుపత్రి వద్ద విషణ్ణవదనాలతో బాధితులు

ప్రాణం తీసిన రహదారి

అదుపుతప్పి కానిస్టేబుల్ మృత్యువాత

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: అధ్వాన రహదారి.. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఓ పోలీసు కానిస్టేబుల్ నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. విధి నిర్వహణకు వెళ్తున్న ఆయన రాళ్లు తేలిన మార్గంలో అదుపుతప్పి మృత్యువాత పడిన ఘటన కురుపాం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నీలకంఠరావు వివరాల మేరకు.. పాలకొండ సమీపంలోని గొట్టమంగళాపురానికి చెందిన కె.బుల్లిబాబు(48) జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్సులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈయన శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో నివాసం ఉంటున్నారు. విధుల్లో భాగంగా గురువారం గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎల్విన్‌పేటకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కురుపాం మండలంలోని జరడ- నీలకంఠాపురం ఘాట్ మార్గంలో అదుపుతప్పి పడిపోయారు. తల రహదారికి బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతదేహాన్ని భద్రగిరి ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



బుల్లిబాబు (పాతచిత్రం)

ప్రతిపాదనలు పంపించినా..

కురుపాం మండలంలోని నీలకంఠాపురం నుంచి జరడ గ్రామానికి 9 కిలోమీటర్ల పొడవున రోడ్డు ఉంది. ఏళ్ల క్రితం నిర్మించడంతో ప్రస్తుతం చాలా చోట్ల తారు ఊడిపోయింది. ఎక్కడికక్కడే కోతకు గురైంది. రాళ్లు తేలి అధ్వానంగా దర్శనమిస్తోంది. ఇప్పటికే పలువురు ఈ మార్గంలో అదుపుతప్పి గాయాల పాలైన ఘటనలు నమోదయ్యాయి. ఈ ఏడాది మార్చిలో ఉపాధి పనుల్లో భాగంగా రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లతో అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఐటీడీఏ జేఈ అప్పారావు తెలిపారు. అయినా నిధులు మంజూరు కాలేదని ఆయన తెలియజేశారు.



నీలకంఠాపురం- జరడ ఘాట్ మార్గం

తొలి చూపే.. చివరిదైంది

కుమారుడ్ని చూసేందుకు వచ్చి దుర్మరణం

కొమరాడ, న్యూస్‌టుడే: కుటుంబ పోషణ కోసం పొరుగు రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు.. భార్య ప్రసవించినా.. సెలవులు దొరకకపోవడంతో సకాలంలో ఇంటికి రాలేకపోయారు. ఎట్టకేలకు దాదాపు మూడు వారాలు దాటాక స్వగ్రామానికి చేరుకున్నారు. కుమారుడ్ని కళ్లారా చూశారు. కానీ ఆ సంతోషం ఎంత సేపూ నిలవలేదు. చెరువు రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ఘటనలో హోంగార్డు దుర్మరణం చెందారు. ఏఎస్సై నాయుడు వివరాల ప్రకారం.. కొమరాడ మండలం చంద్రంపేట గ్రామానికి చెందిన జి.సింహగిరి(42) తెలంగాణలోని ఖైరతాబాద్ పోలీసు ఠాణాలో హోంగార్డుగా పనిచేస్తున్నారు. అతని భార్య భారతి ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చారు. దీంతో సింహగిరి సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. గురువారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని చెరువుకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ అందులో పడి మరణించారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా.. ఈక్రమంలో చెరువులో విగతజీవిగా కనిపించారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



సింహగిరి (పాతచిత్రం)

చికిత్స పొందుతూ మృతి

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బొండపల్లి మండలానికి చెందిన ఎర్రినాయుడు(44) విజయనగరంలోని సీఎంఆర్ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా ఆర్టీవో కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంతో వస్తూ ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎర్రినాయుడును స్థానికులు ఆసుపత్రికి తరలించగా.. గురువారం వేకువజామున మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ ఎస్సై నరేష్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పార్వతీపురం	- 8008566244
పాలకొండ	- 8008574299
సాలూరు	- 8008786820
కురుపాం	- 9849044696

(10 AM TO 1 PM)

? కాంప్లెక్స్ నుంచి గ్రంథాలయానికి వెళ్లే మార్గంలో పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. - **స్థానికులు**

● పరిశీలించి మొక్కలు తొలగిస్తాం. - **గౌరీశంకరరావు, సర్పంచి**

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

? అరసాడ పీహెచ్‌సీ చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. విష సర్పాలు, కీటకాలు వచ్చే ప్రమాదం ఉంది. - **రోగులు**

● వర్షాలతో పనికిరాని మొక్కలు పెరిగాయి. శుభ్రం చేస్తాం. - **శశిధర్, వైద్యాధికారి**

? లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని పలు కూడళ్లలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. - **వెంకటరమణ**

● పగటి సమయంలో దీపాలు ఆగేలా చూస్తాం. - **వెంకటనాయుడు, కార్యదర్శి**

– న్యూస్‌టుడే, సీతానగరం

? పలగరలో పశువైద్య భవనం నిర్మాణానికి గోతులు తీసి వదిలేశారు. - **అప్పారావు**

● విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి సూచన మేరకు తదుపు చర్యలు చేపడతాం. - **జి.గణేష్, మండల పశువైద్యాధికారి**

– న్యూస్‌టుడే, బలిజిపేట

? పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రి వెనుక మురుగు నీరు నిల్వ ఉంటోంది. - **రమ్య**

● పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. - **ఎస్.సర్వేశ్వరరావు, కమిషనరు**

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

పాలకొండ, న్యూస్‌టుడే: సమస్యల సాధనకు, పలువురు అధికారుల తీరుకు నిరసనగా గురువారం పాలకొండలో ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. తమను ఇబ్బందులకు గురిచేయడం సరికాదంటూ నినాదాలు చేశారు. తమకు అండగా నిలవాలని కోరారు.

అభివృద్ధి వైపే కూటమి అడుగులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి అడుగు అభివృద్ధి పనుల వైపే వేస్తోందని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. రూ.కోటితో చేపట్టనున్న కంబర రహదారి పనులకు గురువారం భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో రహదారులు, మురుగు కాలువలతో పాటు అన్ని రకాల అభివృద్ధి పనులకు చర్యలు చేపడతామని తెలిపారు. పాలకొండ ఏఎంసీ మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తినాయుడు, మండలాధ్యక్షుడు యు.భాస్కరరావు, తెదేపా, జనసేన నాయకులు లక్ష్మీనారాయణ, ఎం.వంశవర్ధనరావు, ఎం.నందీశ్వరరావు, పి.నాగేశ్వరరావు, జి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి


వివరాలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విజయపార్వతి

కొమరాడ, న్యూస్‌టుడే: రోగులకు వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో విజయపార్వతి సూచించారు. గురువారం రామభద్రపురం, కొమరాడ పీహెచ్‌సీలను సందర్శించారు. ఇటీవల జ్వర బాధితులు పెరుగుతున్నారని, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. డెంగీ లక్షణాలు గుర్తిస్తే వైద్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు, వైద్యులు ఉన్నారు.

అందుబాటులోకి వాహనం



సాలూరు గ్రామీణం: సాలూరు పురపాలిక పరిధిలో మరమ్మతులకు గురైన కాంపాక్టర్ వాహనం అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ చెత్త తరలింపునకు 2 వాహనాలు కేటాయించగా మూలకు చేరాయి. పరిసరాలు అధ్వానంగా మారడంతో ఈ నెల 11న ఈనాడులో 'సాలూరు పట్టణం చెత్తమయం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి ఒక వాహనాన్ని గురువారం అందుబాటులోకి తీసుకొచ్చారు.

స్పందనకు వందనం

నీటి వృథాకు అడ్డుకట్ట

పాలకొండ గ్రామీణం: పట్టణంలోని మురళీమోహన్ నగర్ కూడలిలో నీటి వృథాను నగర పంచాయతీ సిబ్బంది అరికట్టారు. ఎయిర్‌వాల్వ్ నుంచి నీరు వృథా కావడంతో ఈ నెల 17న 'ఈనాడు'లో 'రక్షిత నీరు వృథా' శీర్షికతో ప్రచురితమైన వార్తపై ఏఈ దేవీవరప్రసాద్ స్పందించి మరమ్మతులు చేయించారు.

రహదారి బాగు

పార్వతీపురం గ్రామీణం: మండలంలోని వీఆర్‌పేట నుంచి సన్యాసిరాజుపేట మార్గంలో జంఝావతి వంతెన రెండు వైపులా కోతకు గురైంది. రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఆగస్టు 10న 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. సర్పంచి భర్త వెంకటనాయుడు, రైతులు స్పందించి రోడ్డు బాగు చేశారు.

రక్షిత పథకం శుభ్రం



గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మండలంలోని బబ్బిడిలో రక్షిత ట్యాంకు నుంచి సరఫరా చేస్తున్న నీరు కలుషితం అవుతోందని ఓ పాఠకుడు ఈ నెల 15న ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురించగా.. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ స్పందించారు. ట్యాంకు పరిసరాలను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేపట్టారు.

ఒడిసి పడదాం.. భూగర్భ జలాలు పెంచుదాం


గుమ్మలక్ష్మీపురం మండలంలో కుంట తవ్వుతున్న కూలీలు

న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

భూగర్భ జలాల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వర్షపు నీరు ఒడిసి పట్టి.. వృథా నీటిని భూములోకి మళ్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు. సాగునీటి ఎద్దడి నివారణకు ప్రతి గ్రామంలోని పంట భూముల్లో నీటి కుంటలు (ఫారమ్ పాండ్స్) అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కుంటలు తవ్వుతున్నారు.

జిల్లాలో సేద్యపు కుంటల నిర్మాణాలు చేపట్టేందుకు ఉపాధి హామీ అధికారులు ప్రణాళికలు వేశారు. ఒక్కో కుంటకు పరిమాణం బట్టి రూ.10 వేలు నుంచి రూ.60 వేలు నిధులు కేటాయిస్తున్నారు. జిల్లాలోని 178 పంచాయతీల్లో 717 కుంటలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా నిర్దేశించారు. ఈ నెల 7 నాటికి 323 చోట్ల పనులు ప్రారంభించగా.. 264 చోట్ల పూర్తి చేశారు. బలిజిపేట మండలంలోని 15 పంచాయతీల్లో అత్యధికంగా 147 మంజూరవగా 18 పూర్తి చేశారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని 19 పంచాయతీల్లో 104 పనులకు గాను 59 చోట్ల జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఎంతో ఉపయోగం

సేద్యపు కుంటలు తవ్వడంతో భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చు. వృథా నీటిని గుంతల్లోకి మళ్లిస్తే నీటి ఎద్దడి సమయంలో ఎంతోగానో ఉపయోగపడతాయి. ప్రస్తుతం జిల్లాలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– **రామచంద్రరావు, డ్వామా పీడీ**

ఎన్నో ప్రయోజనాలు..

పంట భూముల్లో సేద్యపు కుంటలు నిర్మిస్తే నీటి ఎద్దడి తగ్గుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. మెట్ట ప్రాంతాల్లో రైతులు అవసరం మేరకు సాగు నీరు వాడుకోవచ్చు. ఏజెన్సీలో కొండలపై నుంచి జాలువారే ఊట నీరు ఒడిసి పట్టే అవకాశం ఉంది. వేసవిలో పక్షులు, మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు ఉపయోగపడతాయి. నీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో తవ్వితే ఆరుతడి పంటలు వేసుకొని లాభసాటి వ్యవసాయం చేయొచ్చు.

విస్మరించిన గత ప్రభుత్వం..

భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో గతంలో తెదేపా ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించింది. అప్పట్లో రూ.10 వేలు చొప్పున కేటాయించి ఇళ్లు, బోర్లు, బావుల వద్ద ఇంకుడు గుంతలు తవ్వించింది. ఉమ్మడి జిల్లాలోని మెట్ట భూముల్లో పంట సంజీవిని పేరుతో సుమారు 20 వేల వరకు సేద్యపు కుంటలు నిర్మించారు. 2019 వరకు ఈ కార్యక్రమం సాగింది. వైకాపా వచ్చాక పథకం పూర్తిగా పడకేసింది.

వాల్మీకి ఆదర్శప్రాయులు


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, అధికారులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: వాల్మీకి ఆదర్శప్రాయులని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి రామాయణం మానవతా విలువలు, ఉన్నత భావాలను బోధిస్తుందన్నారు. ఏఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఆర్ డీఎస్పీ వెంకటప్పారావు, ఆర్ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, ఎస్ఐలు పాల్గొన్నారు. * గుమ్మలక్ష్మీపురం: వాల్మీకి గొప్ప మహర్షి అని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీవరం పేర్కొన్నారు. కళాశాలలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. * సీతంపేట: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు. * పాలకొండ గ్రామీణం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి జీవిత ఘట్టాలపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ప్రధానాచార్యులు డా.శ్యాంబాబు బహుమతులను అందజేశారు.

మరుగుదొడ్డికి దారేది?



పాలకొండ పట్టణ శివారువీధుల మహిళలకు ఆరుబయట కష్టాలు తీరడం లేదు. గారమ్మకాలనీ స్వాగత ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్డికి వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారిపై చెత్తకుప్పలు వేయడంతో మరుగుదొడ్డి దారి కనుమరుగైంది. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. చెత్త కుప్పలు తొలగించి దారి కల్పిస్తామని నగర పంచాయతీ కమిషనరు ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

రహదారిపై మురుగు ప్రవాహం

గరుగుబిల్లి మండలం పెద్దూరులో కాలువలు సక్రమంగా లేకపోవడంతో వాడుక నీరు రహదారిపై పారుతోంది. పక్కనే నిల్వ చేరి మురుగుగా మారుతోంది. దుర్వాసనతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై నాచు పట్టడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయని పలువురు వాపోతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ గోపాలరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి మురుగు నీరు మళ్లిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, గరుగుబిల్లి



హెచ్ఐవీపై అవగాహన అవసరం


సూచనలు చేస్తున్న ప్రబంధకుడు ఆదిలింగం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: హెచ్ఐవీ ఎయిడ్స్ బాధితులు మందులు వాడేలా సిబ్బంది అవగాహన కల్పించాలని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ క్లస్టర్ ప్రోగ్రాం ప్రబంధకుడు జి.ఆదిలింగం సూచించారు. గురువారం జిల్లా ఆసుపత్రిలో సమావేశం నిర్వహించారు. సేవలు చేరువ చేసేందుకు కమ్యూనిటీ రిసోర్సు గ్రూపు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి ఉన్న వారిని సభ్యులుగా చేర్చుతున్నామన్నారు. జిల్లా పర్యవేక్షకులు సాక్షిగోపాల్, కౌన్సిలర్ కృష్ణమూర్తి, ఏఆర్‌టీ సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సూరంపేటలో ఏనుగుల తిష్ఠ

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని సూరంపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు తిష్ఠ వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుచ్చిమి, తాన్న సీతారాంపురం, సూరంపేట గ్రామాల పరిసరాల్లోని మామిడి, జీడి తోటల్లో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రాత్రి వేళ వరి పొలాల్లోకి వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.


మామిడితోటలో కరిరాజుల గుంపు

పన్ను వసూళ్లు సమర్థంగా చేయాలి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పురపాలిక పరిధిలో పన్ను వసూళ్ల కార్యక్రమం సక్రమంగా జరుగుతోందని కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. గత సెప్టెంబరులో రోజుకు రూ.10 వేలు కూడా వసూలు జరగలేదని గుర్తుచేశారు. అక్టోబరు నుంచి రెవెన్యూ అధికారి ప్రసాదరావు నేతృత్వంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సగటున రోజుకు సుమారు రూ.లక్ష వరకు వసూలు చేశారన్నారు. ఈనెలలో రూ.9 లక్షలు ఆదాయం సమకూరినట్లు చెప్పారు. మరింత సమర్థంగా చేపట్టాలని సూచించారు.

పార్వతీపురాన్ని సుందరంగా మార్చుదాం

పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు సహకారం అందించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి పుర అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులతో చర్చించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లను ఆకర్షించేలా మార్చాలన్నారు. సుందరనారాయణ లేఅవుటులో నవంబరు 14 నాటికి పార్కు సిద్ధం చేయాలని ఆదేశించారు. జట్టు ఆశ్రమ నిర్వాహకులు వి.పద్మజ, అధికారులు పాల్గొన్నారు.

శాఖల ప్రగతిపై సమీక్ష

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండల పరిషత్తు సమావేశం గతానికి భిన్నంగా సాగింది. గురువారం ఎంపీపీ రమణమ్మ అధ్యక్షతన శాఖల వారీగా ప్రగతిపై సమీక్షించారు. తొలుత ఆరోగ్య, వ్యవసాయ అధికారులు ప్రగతి గురించి వివరించారు. తర్వాత మిగిలిన అధికారులు వివరాలు వెల్లడించారు. గతంలో గందరగోళంగా జరిగేవని, ప్రస్తుత సమావేశం తీరుతో అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని పలువురు ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు బలోపేతం కావాలని ఎమ్మెల్యే జయకృష్ణ పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణ మహిళా సమాఖ్య పదాధికారుల ఎంపిక నిర్వహించారు. కూటమి నాయకులు, కమిషనరు సర్వేశ్వరరావు ఉన్నారు.

గిరిజన గూడేలను గుర్తించాలి

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలోని తక్కువ సంఖ్యలో నివాసాలు ఉంటున్న గ్రామాలు, గిరిజన గూడేలను గుర్తించాలని ఎంపీడీవో బీవీజే పాత్రో తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో పీఎం జన్‌మన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో వీధిరోడ్లు, తాగునీరు, విద్యుత్తు సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని తెలిపారు. మండలంలోని 29 పంచాయతీల్లో 215 మధుర గ్రామాలు ఉన్నాయని, వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని, రెండు రోజుల్లో నివేదికలు అందించాలని సూచించారు.

వాణిజ్య కూడలి.. సమస్యల చిక్కుముడి

పార్వతీపురంలోని పాతబస్టాండు ప్రాంతం జిల్లా కేంద్రానికి ప్రధాన వాణిజ్య కూడలి. సరిహద్దు రాష్ట్రాలకు ఈ ప్రాంతం మీదుగానే వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోజూ ఉదయాన్నే ఇక్కడికి పరిసర ప్రాంతాల రైతులు కూరగాయలు తీసుకొచ్చి అమ్మకాలు చేపడతారు. ఇంత ప్రాధాన్యం ఉన్న పాత బస్టాండు ఆరేళ్లుగా అభివృద్ధికి దూరమైంది.



పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే


పాత బస్టాండు ప్రాంతంలో సరైన రహదారులు, కాలువలు కనిపించవు. రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.56 లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించినా పనులు ప్రారంభించలేదు. ఇరువైపులా కాలువలపై నిర్మాణాలతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఇదే మార్గంలో పెట్రోల్ బంకు వద్ద మురుగు రహదారిపై పారుతోంది. ఇక్కడ బస్టాప్, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.


బీటలు వారిన రహదారి

వీడని ట్రాఫిక్ కష్టాలు..

ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలు, శ్రీకాకుళం, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు పాతబస్టాండు మీదుగానే వెళ్తాయి. ఇక్కడ సుమారు 940 మీటర్ల పొడవున రహదారి పూర్తిగా ఛిద్రమైంది. దీనిపై డీఈ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని, త్వరలో పనులు చేపడతామన్నారు.


సాలూరులో మణిద్వీప వర్ణన పూజలు


గరుగుబిల్లిలో కొలువుదీరిన విగ్రహాలు

గౌరీ పౌర్ణమి సందర్భంగా గ్రామాల్లో నందెన్న విగ్రహాలు ఏర్పాటు చేశారు. ముందుగా విగ్రహాలను వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. సాలూరు పెదకోమటిపేట రామాలయంలో మాతృమండలి సభ్యుల ఆధ్వర్యంలో లలితాదేవికి మణిద్వీప వర్ణన పూజలు చేపట్టారు. – న్యూస్‌టుడే, బృందం

తప్పుల సవరణకు అవకాశం

గుమ్మలక్ష్మీపురం: భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో తప్పుల సవరణకు వినతులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దారు శేఖరు తెలిపారు. మండలంలోని గౌడుగూడలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సవరణకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

నేడు వైద్య శిబిరం

జియ్యమ్మవలస: టీకేజమ్ములో రూట్స్ స్వచ్ఛంద సంస్థ, శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని ఆసుపత్రి ప్రబంధకుడు కె.రమేష్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరం ఉంటుందన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు డిమాండు

మక్కువ: దుగ్గేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండు చేస్తున్నారు. గ్రామంలో సీపీఎం శాఖ మహాసభలు నిర్వహించి ఎం.లక్ష్మణ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. మండల కేంద్రంలోని గిరిజన బాల బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు.

ఎంపీడీవోగా రంగారావు

పాలకొండ: పాలకొండ మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎంవీ రంగారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉమామహేశ్వరి జియ్యమ్మవలస ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు.

రహదారి మరమ్మతులు చేయాలి

సీతంపేట: పూతికవలస ప్రధాన రహదారి మరమ్మత్తు పనులు చేయాలని సీపీఎం నాయకుడు ఎ.భాస్కరరావు కోరారు. 36 గిరిజన గ్రామాల ప్రజలకు ఉపయోగపడే రహదారి దారుణంగా మారిందన్నారు. కనీసం గుంతలైనా పూడ్చాలని కోరారు. రహదారి పనులు చేపట్టకపోతే ఆందోళన చేపడతామన్నారు.

సేవా కేంద్రాల్లో విత్తనాలు

బలిజిపేట, న్యూస్‌టుడే: రబీలో పండించేందుకు మినుము, పెసర విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు ఏవో శ్రావణ్‌కుమార్ తెలిపారు. సచివాలయంలో రైతులు పేర్లు నమోదు చేసుకొని, నగదు చెల్లించాలన్నారు. మినుములు వీబీఎన్-8 రకం కిలో రూ.140 ఉండగా, రూ.98కి, పెసలు ఐపీఎం 205-7 రకం కిలో రూ.130కి గాను రూ.91కే విక్రయిస్తామని తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తు న్న హరీష

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రొమ్ము క్యాన్సర్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి ప్రాంతీయాసుపత్రి ప్రసూతి వైద్య నిపుణురాలు హరీష మాట్లాడుతూ.. వ్యాధి లక్షణాలను గుర్తించడం, ముందు జాగ్రత్తలు, వ్యాధి సోకిన తర్వాత తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుశాంత్ జనా, వైస్ ప్రిన్సిపల్ వి.ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యార్డుల్లో వ్యర్థాల విభజన

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణాల్లో సేకరిస్తున్న వ్యర్థాలను డంపింగ్ యార్డుల్లో విభజించనున్నట్లు విజయనగరం కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. ప్రజారోగ్య విభాగం ఈఈ జ్యోతితో కలిసి రాయగడ రోడ్డు శివారులోని యార్డును పరిశీలించారు. అవసరమైన స్థలం, విద్యుత్తు, నీటి సౌకర్యం సిద్ధం చేయాలన్నారు. ఇన్‌ఛార్జి కమిషనరు సన్యాసిరావు, డీఈ కిరణ్‌కుమార్, పారిశుద్ధ్య అధికారి కె.పకీరు పాల్గొన్నారు.


సిబ్బందితో చర్చిస్తున్న కమిషనరు నల్లనయ్య, ఈఈ జ్యోతి

పాఠశాలల్లో సౌకర్యాలపై ఆరా


విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో


మక్కువ, న్యూస్‌టుడే: ఏకలవ్య ఆదర్శ పాఠశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. గురువారం మండలంలోని అనసభద్ర ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి పనులపై ఆరా తీశారు. అనంతరం యర్రసామంతవలసలో నిర్వహిస్తున్న తరగతి, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు.

పాల కొనుగోలు ధర పెంచాలి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పశువుల పోషణ ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో పాల కొనుగోలు ధర పెంచాలని పాడిరైతులు ఆందోళన చేశారు. వెంకంపేట బల్కుమిల్కు శీతలీకరణ కేంద్రం వద్ద వివిధ గ్రామాల రైతులు నినాదాలు చేశారు. పశుదాణాపై రాయితీలు పెంచాలని డిమాండు చేశారు. చినబొండపల్లి, తాళ్లబురిడి, సంగంవలస, పెదబొండపల్లి, బందలుప్పి, ములగ రైతులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న పాడి రైతులు

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ


ప్రశ్నలు వేస్తున్న డీడీఈవో కృష్ణమూర్తి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఈవో కృష్ణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని పెదమేరంగి జిల్లా పరిషత్తు పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సామర్థ్యాలు పరీక్షించారు. బాగా చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయుల దస్త్రాలు, డైరీలు, వర్కు పుస్తకాలు, పాఠ్య ప్రణాళికలను పరిశీలించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఈవో కార్యాలయం వద్ద గురువారం యూటీఎఫ్ నాయకులు ధర్నా చేపట్టారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ.. పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని కోరారు. ఈ నెల 24న పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ హెచ్చరించారు. డీఈవో పగడాలమ్మకు వినతి పత్రం ఇచ్చారు.



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు